నమస్తే తెలంగాణ
జగిత్యాల
5 | కరీంనగర్, శుక్రవారం 13 జూన్ 2025 | JAGTIAL

అదనపు కలెక్టర్‌గా అశ్విని తానాజీ వాకడే

అశ్విని తానాజీ వాకడే

- కరీంనగర్ నగరపాలక సంస్థ కమిషనర్‌గా ప్రఫుల్ దేశాయ్
- చాహత్ బాజ్‌పాయ్ వరంగల్‌కు బదిలీ

కరీంనగర్ కార్పొరేషన్, జూన్ 12: కరీంనగర్ జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు)గా 2020 బ్యాచ్‌కి చెందిన అశ్విని తానాజీ వాకడే నియమితులయ్యారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఆమె, బదిలీపై ఇక్కడికి వస్తున్నారు. కాగా, ఇక్కడ పనిచేస్తున్న అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్‌ని కరీంనగర్ నగరపాలక సంస్థ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా నియమించారు. ఇక్కడ కమిషనర్‌గా ఉన్న చాహత్ బాజ్‌పాయ్‌ని వరంగల్ కమిషనర్‌గా బదిలీ చేశారు. ఈ మేరకు గురువారం ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు జారీ చేశారు.

స్కూల్ బస్సులపై కొరడా

తిమ్మాపూర్, జూన్ 12: స్కూల్ బస్సులపై రవాణా శాఖ అధికారులు కొరడా ఝుళిపించారు. గురువారం పాఠశాలలు పునఃప్రారంభం కాగా, ఫిట్‌నెస్ చేసుకోకుండా పిల్లల ప్రాణాలను ప్రమాదపుటంచున పెట్టి నడుస్తున్న బస్సులపై చర్యలకు ఉపక్రమించారు. కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. ఫిట్‌నెస్, ఇతర పత్రాలు లేని నాలుగు బస్సులను సీజ్ చేసి కేసు నమోదు చేశారు. ఫిట్‌నెస్ చేయించుకోవాలని, నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని జిల్లా రవాణా శాఖ అధికారి శ్రీకాంత్ చక్రవర్తి హెచ్చరించారు. ఎంవీఐ రవికుమార్, ఏఎంవీఐ స్రవంతి, సిబ్బంది పాల్గొన్నారు.

రైతుకేదీ భరోసా?



సీజన్ మొదలాయె.. పంట పెట్టుబడి రాకపాయె

- వానకాలం ప్రారంభమైనా పట్టని కాంగ్రెస్ సర్కారు
- 'భరోసా' వస్తుందో.. లేదోనని అనుమానం
- వస్తే సీజన్ మధ్యలోనే అంటున్న అన్నదాతలు
- పోయిన యాసంగిలో భారీగా తగ్గిన రైతుల సంఖ్య
- ఈ సీజన్‌లో ఎంత మందికి వస్తుందోననే సందేహాలు
- విత్తనాలు, ఎరువులకు అప్పులు చేయాల్సిన దుస్థితి

కాంగ్రెస్ పాలనలో రైతుకు భరోసా కరువైంది. బీఆర్ఎస్ హయాంలో ప్రారంభమైన రైతుబంధు పదకొండు సీజన్లలో ఠంఛన్‌గా అందినా.. కొత్త ప్రభుత్వం వచ్చిన తర్వాత అసలు వస్తుందో.. లేదో? తెలియని పరిస్థితి ఉన్నది. పథకం పేరును రైతు భరోసాగా మార్చినా.. భరోసా మాత్రం కల్పించడం లేదు. కేసీఆర్ పాలనలో రైతు బంధు వానకాలం సీజన్‌కు ముందు ఏప్రిల్‌లోనే మొదలై, జూన్ వరకు అన్నదాతలందరికీ అందినా.. ఇప్పుడా పరిస్థితి లేదు. సీజన్‌కు ముందే ఇవ్వాల్సిన పంట పెట్టుబడి సాయాన్ని ఇప్పటి వరకు అందించలేదు. అసలు దానిపై ఊసే లేకపోవడం రైతులను నిరాశకు గురిచేస్తున్నది. దీంతో విత్తనాలు, ఎరువులు సమకూర్చుకునేందుకు అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతున్నది.

కరీంనగర్, జూన్ 12 (నమస్తే తెలంగాణ) : బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రవేశ పెట్టిన రైతు బంధు పథకాన్ని కొనసాగిస్తామని కాకుండా ఎకరానికి ₹10 వేలు కాకుండా ఏడాదికి ₹15 వేలు ఇస్తామని అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ హామీ ఇచ్చింది. కానీ, అధికారంలోకి వచ్చి మూడు సీజన్లు గడిచి పోయినా పట్టించుకోవడం లేదు. 2023-24 యాసంగి సీజన్‌కు గత ప్రభుత్వం ఇచ్చిన మాదిరిగానే ₹10 వేలు ఇచ్చి చేతులు దులుపుకున్నది. 2024 వానకాలంలోనైనా సరైన సమయానికి ప్రభుత్వం పెట్టుబడి సాయం అందిస్తుందని ఆశించినా నిరాశే ఎదురైంది. అర్హులైన రైతులను తేల్చిన తర్వాతనే రైతు భరోసా ఇస్తామని చెప్పి, ఆ సీజన్‌లో ఎగనామం పెట్టింది. రాష్ట్ర మంత్రివర్గంతో సబ్ కమిటీ వేసిన ప్రభుత్వం అర్హులైన వారికే రైతు భరోసా ఇవ్వాలని నిర్ణయించి క్షేత్ర స్థాయిలో సర్వే చేయించింది. కొండను తవ్వి ఎలుకను పట్టినట్టు జిల్లాలో 4 వేలకు పైగా ఎకరాలకు మాత్రమే రైతుభరోసా ఇవ్వరాదని తేల్చింది. అర్హులు ఎంత మందో తేలడంతో 2024-25 యాసంగిలోనైనా రాష్ట్ర ప్రభుత్వం ఇస్తానన్న ఎకరానికి ఏడాదికి ₹15 వేలు వస్తాయని రైతులు ఎదురు చూశారు. కానీ, ఏటా ₹12 వేలు మాత్రమే ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. గత వానకాలం సీజన్‌లో వీటినైనా సమయానికి ఇచ్చారా..? అంటే అదీ లేదు. సీజన్ మధ్యలో విడతల వారీగా ఇచ్చుకుంటూ వచ్చారు. అనర్హులు పోను చాలా మంది అర్హులైన రైతుల ఖాతాల్లో రైతు భరోసా జమ కాలేదు. 2023-24 యాసంగిలో 1,90,820 మంది రైతులకు రైతుబంధు పద్ధతిలోనే ఒక్క సీజన్‌కు ఎకరాకు ₹5 వేల చొప్పున ₹177.61 కోట్లు పెట్టుబడి సాయాన్ని అందించిన ప్రభుత్వం.. 2024-25లో 1,65,850 మంది రైతులకు ఒక్క సీజన్‌కు ఎకరాకు ₹6 వేల చొప్పున ₹132.13 కోట్లు అందించింది. అది కూడా కేవలం 4 ఎకరాలలోపు ఉన్న రైతులకే ఇవ్వగా, అందులోనూ చాలా మందికి అందలేదు.

సీజన్ మొదలైనా ఊసేలేదు

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 2018 వానకాలం సీజన్ నుంచి ప్రారంభమైన రైతుబందు పథకం ఏటా రెండు సీజన్లకు ప్రణాళికాబద్ధంగా రైతులకు పెట్టుబడి సహాయాన్ని అందిస్తూ వచ్చింది. వానకాలం సీజన్‌కైతే ఏప్రిల్ నెల నుంచే రైతుల ఖాతాల్లో రైతు బంధు డబ్బులు జమయ్యేవి. యాసంగిలో అక్టోబర్ నుంచి ప్రారంభమయ్యేది. ఈ విధంగా ముందుగానే రైతుబంధు కింద పెట్టుబడి సాయాన్ని అందించడం వల్ల రైతులు తమకు కావాల్సిన ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసుకుని సీజన్ ప్రారంభించేందుకు సిద్ధమయ్యేవారు. కానీ, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత నాలుగు వ్యవసాయ సీజన్లు వస్తే ఒక సీజన్‌కు ఎగనేసింది. ఇచ్చిన రెండు సీజన్లకు కూడా సరైన సమయానికి ఇవ్వలేదు. ప్రస్తుత వానకాలం సీజన్‌లోనూ అదే పరిస్థితి కనిపిస్తున్నది. సీజన్ ప్రారంభమై రోజులు గడుస్తున్నాయి. అక్కడక్కడా పడిన వర్షాలకు రైతులు దుక్కులు దున్నుకుంటున్నారు. మార్కెట్‌లో విత్తనాలు, ఎరువుల విక్రయాలు వారం పది రోజుల నుంచే అమ్మకాలు జోరందుకున్నాయి. కానీ, ఇప్పటి వరకు రైతులకు ప్రభుత్వం ఇస్తామన్న పెట్టుబడి సాయం మాత్రం అందడం లేదు. తెలంగాణ ఏర్పాటుకు ముందు పెట్టుబడి కోసం రైతులు పడిన ఇబ్బందులు తిరిగి పునరావృతం అవుతున్నాయి. ఒకప్పుడు రైతులు పెట్టుబడి కోసం వడ్డీ వ్యాపారులను ఆశ్రయించేవారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో రైతుబంధు ప్రవేశ పెట్టిన తర్వాత ఆ పరిస్థితి కనుమరుగైంది. సకాలంలో పెట్టుబడి సహాయం అందిన కారణంగా వడ్డీ వ్యాపారాలు మూలన పడ్డాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏ ఒక్క సీజన్‌కు కూడా అనుకూలంగా పెట్టుబడి సాయం అందక పోవడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు.

పదకొండు సీజన్లలో ₹1,735.26కోట్లు

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 2018 మే 10వ తేదీ నుంచి రైతుబంధు పథకం ప్రారంభమైంది. అప్పటి నుంచి 2023 వానకాలం సీజన్ వరకు ఏడాదికి రెండు సార్ల చొప్పున పదకొండు వ్యవసాయ సీజన్లకు పెట్టుబడి సాయం అందించింది. ఒక్క కరీంనగర్ జిల్లాలోనే ₹1,735.26 కోట్ల పెట్టుబడి అందించింది. ఇక కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రెండు సీజన్లకు సాయం ఇచ్చింది. 2023-24 యాసంగిలో 1,90,826 మందికి రైతుబంధు పద్ధతిలోనే ₹177.61 కోట్లు, 2024 వానకాలంలో చేతులెత్తేయగా 2024-25 యాసంగిలో 1,65,850 మంది రైతులకు ₹132.13 కోట్ల చొప్పున ₹309.74 కోట్లు అందించింది. రెండింటిలో ఏ ఒక్క సీజన్‌కు సరైన సమయంలో రైతులకు పెట్టుబడి సాయం అందక పోవడంపై రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రైతు భరోసా వచ్చే వరకు తమకు నమ్మకం లేదని చెబుతున్నారు. నాడు బీఆర్ఎస్ పాలనలో ప్రతి సీజన్‌కు ముందే పెట్టుబడి సాయాన్ని అందించారని, ఈ ఘనత అప్పటి కేసీఆర్ ప్రభుత్వానికి దక్కిందని కొనియాడుతున్నారు.

బీఆర్ఎస్ పాలనలో సీజన్ల వారీగా అందిన సాయం

సంవత్సరం	సీజన్	రైతుల సంఖ్య	అందిన సాయం (కోట్లలో)
2018	వానకాలం	1,30,212	₹117.64
2018-19	యాసంగి	1,34,129	₹123.80
2019	వానకాలం	1,47,583	₹150.38
2019-20	యాసంగి	1,18,625	₹111.06
2020	వానకాలం	1,65,453	₹173.78
2020-21	యాసంగి	1,68,527	₹175.42
2021	వానకాలం	1,73,076	₹175.99
2021-22	యాసంగి	1,77,451	₹176.72
2022	వానకాలం	1,81,908	₹177.78
2022-23	యాసంగి	1,79,422	₹174.92
2023	వానకాలం	1,88,518	₹177.99

కేసీఆర్ కల.. నెరవేరుతున్న వేళ

నేడు పెద్దపల్లిలో డబుల్ బెడ్రూం ఇండ్ల గృహప్రవేశాలు

- బీఆర్ఎస్ హయాంలో 484 ఇండ్ల నిర్మాణం
- మంత్రుల చేతుల మీదుగా పంపిణీకి ఏర్పాట్లు
- లబ్ధిదారుల్లో హర్షాతిరేకాలు

పెద్దపల్లి పట్టణంలోని చందపల్లిలో సిద్ధమైన డబుల్ బెడ్రూం ఇండ్లు

పెద్దపల్లి, జూన్ 12 (నమస్తే తెలంగాణ): తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ సంకల్పం సాక్షాత్కరిస్తున్నది. పేదల సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యంగా బీఆర్ఎస్ హయాంలో పెద్దపల్లి జిల్లా కేంద్రంలో నిర్మించిన 484 డబుల్ బెడ్రూం ఇండ్ల పంపిణీకి వేళయింది. వివరాల్లోకి వెళితే.. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పెద్దపల్లి మున్సిపల్ పరిధిలోని చందపల్లిలో జీప్లస్ +2, 3 పద్ధతిలో 196, రాంపల్లిలో జీప్లస్ +2 పద్ధతిలో 288 డబుల్ బెడ్రూం ఇండ్ల నిర్మాణాన్ని సకల హంగులతో పూర్తి చేశారు. అయితే ఆయా సముదాయాల వద్ద ఇంకా రోడ్లు, డ్రైనేజీలు, తదితర పనులు మిగిలిపోయాయి. తర్వాత అసెంబ్లీ ఎన్నికలు వచ్చాయి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు చొరవతో కొత్త ప్రభుత్వం చేపట్టింది. అదే సమయంలో లబ్ధిదారులను ఎంపిక చేసి ఇండ్లను కేటాయించింది. అన్ని పనులు పూర్తి కావడంతో గృహప్రవేశాలకు ఏర్పాట్లు చేశారు. శుక్రవారం మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ చేతుల మీదుగా లబ్ధిదారులకు ఇండ్ల తాళాలు అందజేసేందుకు ఏర్పాట్లు చేశారు. దీంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గ్రామంలో మంచినీటి సరఫరాను పరిశీలిస్తున్న అధికారులు

కదంబాపూర్‌కు మంచినీళ్లు

- కలెక్టర్ ఆదేశాలతో కదిలిన యంత్రాంగం
- మిషన్ భగీరథ కనెక్షన్లకు మోటర్ల తొలగింపు
- మెరుగుపడిన సరఫరా • గ్రామస్తుల్లో ఆనందం

నమస్తే ఎఫెక్ట్

పెద్దపల్లి, జూన్ 12(నమస్తే తెలంగాణ): కదంబాపూర్ మంచినీటి బాధ తీరింది. గ్రామంలో మానేరు మంచి నీటి పథకం పాడైపోవడం, మిషన్ భగీరథ నీరు సక్రమంగా రాకపోవడంతో గ్రామస్తులు 20 రోజులుగా పడుతున్న గోసను 'మంచినీళ్లు మహాప్రభో!' అనే శీర్షికన గురువారం 'నమస్తే తెలంగాణ'లో కథనాన్ని ప్రచురితం చేయగా, కలెక్టర్ కోయ శ్రీహర్ష స్పందించారు. వెంటనే సమస్యను పరిష్కరించాలని ఆదేశించగా, యంత్రాంగం కదిలింది. ఎంపీడీవో దివ్యదర్శన్ రావు, ఎంపీవో సమ్మిరెడ్డి సూచనలతో పంచాయతీ కార్యదర్శి వినోద్ కృష్ణ, వాటర్ గ్రిడ్ ఏఈ సూర్యతేజ, ఏఈ ఇంట్రా శ్రీకాంత్ గ్రామానికి వెళ్లారు. ఇంటింటికీ మిషన్ భగీరథ కనెక్షన్లు ఉన్నా నీళ్లు సంపూర్ణంగా రాకపోవడానికి కారణాలను అన్వేషించారు. కొంత మంది పైప్‌లైన్లకు అక్రమంగా మోటర్లను బిగించి నీళ్లను పంపింగ్ చేస్తున్నారని, మరికొందరు నల్లా కనెక్షన్ల వద్ద ఫ్లో కంట్రోల్ లాక్ (ఎఫ్‌సీఎల్)ను తొలగించారని గుర్తించారు. అప్పటికప్పుడు మోటర్లను తొలగించగా, సరఫరా కొంత మెరుగుపడింది. అలాగే కరీంనగర్ నుంచి ఎఫ్‌సీఎల్‌లను తెప్పించి అన్ని మిషన్ భగీరథ కనెక్షన్లకు బిగించి, ప్రతి ఇంటికి 400 లీటర్లు అందేలా చర్యలు చేపడుతున్నట్లు వారు తెలిపారు. అయితే గ్రామంలోని రక్షిత నీటి పథకాన్ని ప్రతి వానకాలంలో మునిగిపోయే అవకాశాలతో తొలగిస్తామని చెప్పారు. ఇప్పుడు బాగు చేయించినా ఫలితం లేదని, ఈ క్రమంలో వర్షాకాలం పూర్తయ్యే వరకు మిషన్ భగీరథ ద్వారానే ప్రతి ఇంటికీ సరిపడా నీరందిస్తామని వివరించారు. కాగా, తమ మంచినీటి గోసను 'నమస్తే తెలంగాణ' వెలుగులోకి తేవడంతోనే పరిష్కారమైందని ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. గ్రామంలో నల్లాలకు మోటర్లు బిగించుకున్న విషయం తెలిసినా తాము అక్కడికి వెళ్లి వాటిని తొలగించలేమని, వార్తా కథనం వల్లే పంచాయతీ అధికారులు తొలగించారని, సమస్య పరిష్కరిస్తున్నారని చెప్పారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు, నమస్తే తెలంగాణకు కృతజ్ఞతలు తెలిపారు.


కరీంనగర్ బస్టాండ్ ఆవరణలో ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

పెంచిన బస్ చార్జీలను తగ్గించాలి

కరీంనగర్ బస్టేషన్ ఆవరణలో సీపీఎం నిరసన

తెలంగాణచౌక్, జూన్ 12 : టోల్ ట్యాక్సీ పేరుతో పెంచిన ఆర్టీసీ బస్సు చార్జీలను వెంటనే తగ్గించాలని సీపీఎం కరీంనగర్ జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం కరీంనగర్ బస్టేషన్ ఆవరణలో జిల్లా కమిటీ సభ్యులతో కలిసి నిరసన ప్రదర్శన చేపట్టారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినదించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బస్సు చార్జీలతోపాటు విద్యార్థుల పాసుల ధరలను పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో పేద, మధ్య తరగతి ప్రజల మీద భారం పడుతుందన్నారు. పేద విద్యార్థులు విద్యకు దూరమయ్యే ప్రమాదాలున్నాయన్నారు. ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆర్టీసీ పేదల రవాణా వ్యవస్థ అని, చార్జీలను పెంచడం అన్యాయమని మండిపడ్డారు. ఆర్టీసీకి టోల్ టాక్స్ నుంచి మినహాయింపు ఇచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవ తీసుకొని కేంద్రంతో చర్చించాలన్నారు. చార్జీలను తగ్గించకుంటే ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నిరసనలో పార్టీ జిల్లా కార్యదర్శి కార్యవర్గ సభ్యుడు గీట్ల ముకుందరెడ్డి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేశ్, నాయకులు తిరుపతినాయక్, మల్లయ్య, సాయికుమార్ పాల్గొన్నారు.

తెరుచుకున్న బడులు

మొదటి రోజు హాజరు అంతంతే..

కమాన్‌చౌరస్తా, జూన్ 12 : వేసవి సెలవుల అనంతరం గురువారం పాఠశాలలు పునః ప్రారంభమయ్యాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలు తెరుచుకున్నాయి. సర్కారు బడులు ఉదయం 9 గంటలకు ప్రారంభమైనా 9.30 గంటల నుంచే కార్యక్రమాలు మొదలయ్యాయి. అయితే, మొదటి రోజు కావడంతో విద్యార్థులు తక్కువ సంఖ్యలో వచ్చారు. స్కూల్ ఆవరణల్లో సందడి చేశారు. కొత్త తరగతి గదుల్లో కూర్చొని సంబురపడ్డారు.

సింగరేణిలో మందుల కొరత

- కార్మికులను గోస పెట్టుకుంటున్న యాజమాన్యం
- సరిపడా మందులు లేక కార్మిక కుటుంబాల ఇబ్బందులు
- కార్మికుల సంక్షేమంపై నిర్లక్ష్యం

భూతల్లి ఒడిలో పనిచేస్తూ.. నల్లబంగారాన్ని వెలికి తీసే నల్ల సూర్యులు, వారి కుటుంబాల ఆరోగ్యం విషయంలో సింగరేణి యాజమాన్యం పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నది. ప్రమాదపుటంచున పనిచేస్తూ, ఉద్యోగ విరమణ తర్వాత అనేక జబ్బులతో సతమతమవుతున్నా అశ్రద్ధ చూపుతున్నది. దీంతో కార్మికులు, వారి కుటుంబసభ్యులు ఇబ్బంది పడాల్సి వస్తున్నది

మందులు తీసుకుంటున్న కార్మికులు, కుటుంబసభ్యులు

పెద్దపల్లి, జూన్ 12 (నమస్తే తెలంగాణ) : సింగరేణి భద్రాద్రి జిల్లా కొత్తగూడెం, ఖమ్మం, జయశంకర్‌భూపాలపల్లి, పెద్దపల్లి, మంచిర్యాల, కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాల్లో విస్తరించింది. 24 భూగర్భ గనులు, 18 ఉపరితల గనులు మొత్తంగా 42 గనులను కలిగి ఉంది. దాదాపుగా 40 వేల మంది వరకు ఉద్యోగులు, సిబ్బంది, కార్మికులు పనిచేస్తున్నారు. మరో 25 వేల మంది కాంట్రాక్టు కార్మికులు ఉన్నారు. ఇలా ఉద్యోగంలో ఉన్న వారి ద్వారా స్వయంగా దాదాపుగా 2 లక్షల మంది వరకు ప్రజలు ఆధారపడి జీవిస్తున్నారు. అలాగే ఉద్యోగ విరమణ పొందిన దాదాపుగా 1.60లక్షల మందికి సంబంధించిన మరో 4లక్షల వరకు జనాభా సింగరేణిపై ఆధారపడి జీవిస్తున్నది. రాష్ట్రంలో ఏ కంపెనీకి లేనన్ని కార్మిక కుటుంబాలను కలిగి ఉన్న సింగరేణి సంస్థ, లాభాల బాటలో పయనిస్తుండడంతో పాటు సామాజిక బాధ్యతతో చాలా మందికి అనేక రకాల ప్రయోజనాలను కల్పిస్తున్నది. కానీ, తమ సొంత కార్మికులు, వారి కుటుంబాలను మాత్రం నిర్లక్ష్యం చేస్తున్నదనే అపవాదును మూటగట్టుకుంటున్నది. సింగరేణి వ్యాప్తంగా తమ కార్మికుల వైద్య సాయం కోసం ఆరు జిల్లాల్లో 6 ఏరియా దవాఖానలతోపాటు 21 డిస్పెన్సరీలు, కొత్తగూడెంలో ప్రధాన దవాఖానను ఏర్పాటు చేసినప్పటికీ వైద్య సేవల్లో మాత్రం నిర్లక్ష్యమే చేస్తున్నదని చెప్పాలి. ఏటా దాదాపుగా ₹35కోట్ల నుంచి ₹40కోట్ల వరకు మందులను కొనుగోలు చేస్తున్నప్పటికీ అవి సరిపోవడం లేదు. రాష్ట్ర ప్రభుత్వానికే అనేక రకాల అభివృద్ధికి నిధులను వెచ్చిస్తున్న సింగరేణి అసలు కార్మికులను నిర్లక్ష్యం చేస్తున్నది. వారి ఆ రోగ్యం కోసం ఖర్చు చేయడానికి వెనుకాడుతున్నది. సింగరేణి కార్మికుల వైద్య సేవలకు ఒక్కటంటే ఒక్క సూపర్ స్పెషాలిటీ దవాఖానను కూడా నిర్మించకుండా ప్రైవేటుగా దాదాపు 150 సూపర్ స్పెషాలిటీ దవాఖానలకు ఎంప్యానల్ మెంట్ ఇచ్చి పెద్ద ఎత్తున నిధుల దుర్వినియోగానికి పాల్పడుతున్నదనే విమర్శలు వినిపిస్తున్నాయి. సూపర్ స్పెషాలిటీ దవాఖానల ద్వారా ఒక వైపు సింగరేణి నిధులు ఖర్చు అవుతుండగా.. మరో వైపు కార్మికులను సైతం ముక్కు పిండి డబ్బులు వసూలు చేస్తూ నిలువు దోపిడీ చేస్తున్నారు.

గోదావరిఖనిలోని సింగరేణి ఏరియా దవాఖాన

మందులు లేక ఇబ్బందులు

సింగరేణి నిర్వహిస్తున్న 21 డిస్పెన్సరీలు, 6 ఏరియా దవాఖానల్లో కనీసం క్రానిక్ డిసీజస్‌కు సంబంధించిన మందులు కూడా అందుబాటులో లేవు. దీంతో బీపీ, షుగర్, థైరాయిడ్ లాంటి జబ్బులకు మందులు లేక నెల రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా సింగరేణి కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తీవ్రమైన అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్నారు. ప్రతి నెలా ఈ క్రానిక్ డిసీజెస్‌కు సంబంధించిన మందులు వాడే వారిలో ప్రస్తుత సింగరేణి కార్మికులతోపాటు రిటైర్డ్ కార్మికుల కుటుంబాల వారు సైతం ఉంటారు. ఇంకా అనేక రకాల మందులు సైతం సింగరేణి దవాఖానలో అందుబాటులో లేవు.

కొనుగోలులో జాప్యం

సింగరేణి సంస్థ వద్ద నిధులు ఉన్నా మందుల కొనుగోలులో జాప్యం కారణంగా కార్మికులు, వారి కుటుంబాలకు ప్రాణాంతకంగా మారింది. దవాఖానకు వచ్చిన కార్మికులు, వారి కుటుంబ సభ్యులు మందులు అందుబాటులో లేక నిరాశగా వెనుదిరుగుతున్నారు. ఏవైతే మందులు అందుబాటులో లేవో అలాంటి వాటిని స్థానికంగా కొనుగోలు చేస్తున్నప్పటికీ అవి సరిపోవడం లేదు. ఏరియా దవాఖానల్లో సరిపడా మందులు లేక పోవడంతో రిటైర్డ్ కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రిటైర్డ్ కార్మికులు తమ ఉద్యోగ విరమణ పూర్తి కాగానే ఎక్కడెక్కడో స్థిరపడి పోతారు. అనారోగ్య సమస్యలతో ఏరియా దవాఖానలకు వచ్చి పరీక్షలు చేయించుకొని మందులు తీసుకుంటారు. అలాంటి వారు కూడా మందులు లేక తీవ్ర నిరాశతో వెనుదిరుగుతున్నారు. కనీసం స్టాక్ అందుబాటులో లేదనే సమాచారం ముందుగా ఇచ్చేవారు కూడా లేరు. మార్చిలోనే రావాల్సిన మెడిసిన్ అందుబాటులోకి రాకపోవడంతో ఈ తిప్పలు తప్పడం లేదు. మే 15ననే టెండర్ల ప్రక్రియ పూర్తికాగా ఇప్పటికే మందుల సరఫరా జరగాలి. కానీ, ఇంకా ఏయే వ్యవహారాలు పెండింగ్‌లో ఉన్నాయో ఏమో కానీ, మందుల సరఫరా మాత్రం ఇంకా ప్రారంభం కాలేదు.

అన్ని మందులు ఆర్డర్ పెట్టినం

ప్రతీ రెండు సంవత్సరాలకు ఒకసారి మందులకు టెండర్లు పిలుస్తాం. ఇప్పుడు టెండర్ల ప్రక్రియ పూర్తయ్యింది. త్వరలోనే మందుల కొరత సమస్య తీరుతుంది. కార్మికులు, కార్మికుల కుటుంబాలు, కార్మిక సంఘాలు ఎవరూ ఆందోళన చెందవద్దు. ఆర్డర్లు ఇచ్చేశాం. మందులు వస్తాయి. మందలకు సరిపడా బిల్లుల పేమెంట్ కూడా చేశాం. ఈ కొద్ది రోజులు అడ్జస్ట్ మెంట్ చేసుకోవాలి. మళ్లీ తిరిగి పుష్కలంగా మందులు వస్తాయి. ఆందోళన చెందొద్దు.

- కిరణ్‌రాజ్‌కుమార్, చీఫ్‌మెడికల్ ఆఫీసర్ (కొత్తగూడెం)

సరిపడా మందులు ఇవ్వడం లేదు

మందుల కోసం ఇక్కడిదాకా వచ్చినం. కానీ, ఇక్కడ ఓటుంటే ఓటి లేదు. కనీసం బీపీ గోలీలు కూడా లేవు. 40 ఎంజీకి బదులు 20 ఎంజీ గోలీలు ఇస్తున్నారు. నెల రోజులకు బదులు పది రోజులకు మందులు ఇస్తున్నారు. సిబ్బందిని అడిగితే వెళ్లి తెచ్చుకోండి అంటున్నరు. ఇక్కడికి వస్తే ఇట్లంటున్నరు. అన్ని మందులు అందుబాటులో ఉంచాలె. మల్ల మల్ల రాకుంటా చూడాలె.

- అన్వర్‌పాషా, జనరల్ మజ్దూర్ (ఐకే-1ఏ శ్రీరాంపూర్)

గోలీలు లేవంటున్నరు

నాకు ఫిట్స్ ఉంది. అది రాకుండా ఉండేటందుకు రక్తం గడ్డకట్టకుండా గోలీలు ఇస్తరు. అవి లేవంటున్నరు. పక్షవాతానికి గోలీలు ఉంటయి. అవీ లేవంటున్నరు. అన్ని గోలీలను దావఖన్ల ఉంచాలే. మా బాధలు ఎవలకు జెప్పుకోవాలే. అన్ని జేత్తన్నం అంటరు గీ గోలీలే సక్కగ ఇత్త లేరు.

- లక్ష్మణ్, రిటైర్డ్ కార్మికుడు (గోదావరిఖని)